





గండేపల్లి మండలంలో నీటమునిగిన వరిచేలు.. సామర్లకోట శివారున ఏలేరు స్లూయిజ్ వద్ద నీటి ప్రవాహం జోరు

వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లా తడిచిముద్దవుతోంది. ఎగువ నుంచి వస్తున్న వాన నీటితో అటు రిజర్వాయర్లు జలకళ సంతరించుకుంటుండగా, వాగులు వంకలు పొర్లుతున్నాయి. చెరువులు, కాలువలను అనుకుని ఉన్న ప్రాంతాల్లో వరి, ఇతర వాణిజ్య పంటలు క్రమేపీ నీటమునుగుతున్నాయి. శనివారం రోజంతా జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురిశాయి. ముసురు తొలగకపోవడంతో పగటి ఉష్ణోగ్రతలు పడిపోయి చలి వాతావరణం కొనసాగుతోంది. కాగా శనివారం ఉదయం నుంచి రోజంతా జిల్లాలో పలుచోట్ల ఈదురుగాలులు పెరిగాయి. దీంతో ఉప్పాడ తీరప్రాంతంలో గాలులకు మత్స్యకారుల తాటాకిళ్ల పైకప్పులు ఎగిరిపోగా, తునిలో ఓ పూరిల్లు నేలకూలింది. తుని-నర్సీపట్నం రహదారిలో భారీ వృక్షం నేలకొరిగింది. సముద్రం మరింత అల్లకల్లోలంగా మారింది. సముద్రంలో గాలుల తీవ్రత మరింత పెరగడంతో అలలు ఉప్పాడ బీచ్ రోడ్డును తాకాయి.

ముంపు.. ముప్పు

- వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా కొనసాగుతోన్న వర్షాలు
- వరి చేలల్లోకి భారీగా చేరుతోన్న నీరు: పలు మండలాల్లో పంటలు మునక
- నారుమడులు 82హెక్టార్లు, వరి చేలు 1,545హెక్టార్లలో మునిగినట్లు అంచనా
- వాగులు,గెడ్డలను ఆనుకుని ఉన్న పత్తి, కూరగాయ పంటల్లోకి చేరుతున్న నీరు
- అటు వర్షాలకుతోడు పెరిగిన ఈదురు గాలుల తీవ్రత: పడిపోయిన ఉష్ణోగ్రతలు
- తుని-నర్సీపట్నం రహదారిలో ఈదురుగాలులకు నేలకొరిగిన భారీ వృక్షం
- ఉప్పాడ తీరప్రాంతంలో మత్స్యకారులు తాటాకిళ్లు పైకప్పులు ఎగిరిపోయిన వైనం
- శనివారం మరింత అల్లకల్లోలంగా సముద్రం: బీచ్‌రోడ్డును తాకిన కెరటాలు
- ఎగువన కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్లకు జలకళ: నిండుకుండలాచెరువులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. అనేక మండలాల్లో ఇప్పటివరకు ఓ మోస్తరు నుంచి భారీగా వానలు కురిశాయి. దీంతో ఎగువ నుంచి వస్తున్న వాన నీటితో జిల్లాలో అనేక మండలాల్లో వరి చేలు నీట మునుగుతున్నాయి. కాలువలు, చెరువులకు సమీపంలో ఉన్న చేలల్లోని వాన నీరు అంతకంతకు పెరుగుతోంది. పల్లపు ప్రాంతాల్లోని పొలాల్లోకి శనివారం మరింత నీరు చేరింది. దీంతో అవన్నీ నీట మునుగుతున్నాయి. ప్రస్తుతం వరి పంట నారుమళ్లు, పిలకదశలో ఉంది. ఈ నేపథ్యంలో చేలల్లోకి వచ్చి చేరుతున్న కొద్దిపాటి నీరుకు సైతం మునిగిపోతున్నాయి. జిల్లా వ్యవసాయశాఖ ఇప్పటివరకు మండలాల వారీగా ప్రాథమికంగా సేకరించిన సమాచారం మేరకు మొత్తం 82 హెక్టార్లలో నారుమళ్లు నీటమునిగాయి. ఇదికాకుండా మరో 1,545 హెక్టార్లలో వరి చేలు నీట మునిగినట్టు గుర్తించారు. అలాగే వాణిజ్య పంటలైన పత్తి, ఇతర కూరగాయ పంటలు కూడా స్వల్పంగా నీట మునిగినట్టు అంచనా వేశారు. అయితే వర్షాలు ఇంకా కొనసాగే అవకాశం ఉండడం, ఎగువ నుంచి నీరు భారీగా వస్తుండడంతో ముంపు ముప్పు మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా శనివారం తెల్లవారుజాము నుంచీ ఈదురుగాలులు పెరిగాయి. ముఖ్యంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. గాలుల తీవ్రత సముద్రంలో అధికంగా ఉండడంతో తీరంలో కెరటాలు భారీగా ఎగసిపడ్డాయి. ఉప్పాడ తీరప్రాంతంలో పలువురి మత్స్యకారుల తాటాకిళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. తునిలో ఓ పూరిల్లు నేలమట్టమైంది. కాగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో మూడోరోజు పోర్టులో బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. ఎనిమిది విదేశీనౌకలు పోర్టులోనే ఉండిపోయాయి. మరోపక్క మూడు రోజులుగా వానలు పడుతుండడం, ముసురు నెలకొని ఉండడంతో శనివారం పగటి ఉష్ణోగ్రతలు 23 డిగ్రీలకు పడిపోయి కొంత చలి వాతావరణం నెలకొంది. ఇదిలాఉంటే జిల్లావ్యాప్తంగా అటు ఎడతెరిపిలేని వానలు, ఎగువ నుంచి వస్తున్న భారీ వాన నీటితో జిల్లాలో సుబ్బారెడ్డిసాగర్, ఏలేరు, పంపా రిజర్వాయర్లు జలకళ సంతరించుకుంటున్నాయి. అటు తాండవ నదికి సైతం ఎర్రనీరు పోటెత్తుతోంది. ప్రస్తుతం జిల్లాలో మూడు రిజర్వాయర్లలోను చాలినంత నీరు లేక వెలవెలబోతున్నాయి. తాజా వర్షాలతో భారీగా నీరు వచ్చి చేరుతోంది. దీంతో తాగు, సాగు నీటి బెంగతీరినట్టయింది.



దానవాయిపేటలో ఎగసిపడుతున్న అలలు.. మాయాపట్నంలో గాలులకు పడిపోయిన తాటాకిల్లు

సముద్ర తీరంలో ఈదురుగాలులు.. అలల ఉధృతి

ఉప్పాడ (కొత్తపల్లి)/తొండంగి, జూలై20: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. శనివారం తెల్లవారుజాము నుంచి తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీచాయి. దీంతో మాయాపట్నంలో సముద్రం ఒడ్డున ఉంటున్న మత్స్యకారులకు చెందిన నాలుగు తాటాకు ఇళ్ల కప్పులు గాలిలోకి ఎగిరిపోయాయి. సముద్ర కెరటాలు సాధారణ స్థాయి నుంచి రెండు మీటర్ల ఎత్తులో ఎగసిపడుతున్నాయి. దీంతో మాయాపట్నం, సూరాడపేట మత్స్యకార గ్రామాల్లో సముద్ర జలాలు మత్స్యకారుల ఇళ్ల ముంగిట్లోకి వస్తోంది. తొండంగి మండలం అద్దరిపేట నుంచి చోడిపల్లిపేట వరకూ తీరం వెంబడి ఈదురుగాలులు పెద్దఎత్తున వీచాయి. సముద్ర జలాలు రంగుమారి అల్పపీడన ప్రభావాన్ని చూపుతున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా తెప్పల్ని సురక్షిత ప్రాంతానికి చేర్చుకున్నారు.



తుని వద్ద పొంగి పొర్లుతున్న తాండవ నది

వీడని వాన.. తాండవ ఉరకలు

తుని రూరల్, జూలై 20: ముసురు వీడలేదు. శనివారం కూడా వర్షం ఎడతెరిపిలేకుండా కురిసింది. నాలుగు రోజుల నుంచి వర్షం పడుతుండడంతో జనజీవనానికి ఇబ్బంది కలిగింది. అటు లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. ఎగువున కురుస్తున్న వర్షాలతో తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. తుని వద్ద డ్యాం పొంగిపొర్లుతోంది. తామవరం, హంసవరం, తేటగుంట, తదితర గ్రామాల్లో పత్తి, కూరగాయల పంటలు మునిగాయి.



ఈ.గోకవరంలోని సుబ్బారెడ్డి సాగర్‌లో జలకళ

సుబ్బారెడ్డి సాగర్‌కు జలకళ

ప్రత్తిపాడు, జూలై 20: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఈ గోకవరం గ్రామంలో మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్‌కు జలకళ వచ్చింది. దీంతోపాటు చంద్రబాబుసాగర్ ప్రాజెక్టు, సాగునీటి చెరువులకు కూడా భారీగా వర్షపునీరు చేరింది. కాగా ఒమ్మంగి గ్రామంలో సగరపు పాపకు చెందిన పెంకుటిల్లు భారీ వర్షాలకు దెబ్బతిందని వీఆర్వో తెలిపారు.



నేలకొరిగిన పెంకుటిల్లు

తుని రూరల్, జూలై 20: ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షానికి తుని పట్టణం 17వ వార్డులో పెంకుటిల్లు నేలకొరిగింది. దుర్గపు సత్యవతికి చెందిన ఈ పెంకుటిల్లుని టీడీపీ నాయకులతో కలిసి వీఆర్వో అనిత పరిశీలించారు. ఈ నివేదికను తహశీల్దార్‌కు అందజేయనున్నారు.

'ఏలేరు'కు జలకళ.. రైతుల కష్టాలకు తెర

జగ్గంపేట, జూలై 20: ఏలేరు ప్రాజెక్టుకు జలకళ వచ్చేసింది. గత వారంలో మూడు టీఎంసీల నీరు ఉంటే ఇప్పుడు ఏడు టీఎంసీలకు చేరింది. రైతులకు నీరందించడం కోసం పురుషోత్తపట్నం ఫేజ్2 నుంచి గోదావరి జలాలను పైపులైన్ల ద్వారా ఏలేరుకు తరలిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు భారీ వర్షాల కారణంగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఏలేరు ప్రాజెక్టుకు నీరు పరవళ్ల తొక్కడంతో ప్రస్తుతం 6.8 టీఎంసీల నీరు నిల్వకు చేరింది. రెండు విధాలుగానూ సాగునీరు అందే పరిస్థితి రావడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఈసారి ముందస్తుగానే వ్యవసాయ పనులు చేసుకునే అవకాశం ఏర్పడిందని చెబుతున్నారు. పుష్కర జలాలను ఏలేరుకు అందించడంతో తాగునీటికీ ఇబ్బందుల్లేవు.

జిల్లా జాయింట్ కలెక్టర్‌గా

ఆర్ గోవిందరావు



కలెక్టరేట్(కాకినాడ), జూలై20: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆర్.గోవిందరావును ప్రభుత్వం నియమించింది. ఈయన ప్రస్తుతం సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్సు అడిషనల్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈయన కన్ఫర్డ్ ఐఏఎస్. నర్సీపట్నం ఆర్డీవోగా, పార్వతీపురం జేసీగానూ విధులు నిర్వర్తించారు.

రామ్‌సుందర్‌రెడ్డి ఆర్‌అండ్‌ఆర్‌కు..

జేసీగా పనిచేస్తున్న రామ్‌సుందర్‌రెడ్డి విజయవాడకు బదిలీ అయ్యారు. ఈయన్ని ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్‌గా, కమెండ్ ఏరియా డవలప్‌మెంట్ అథారిటీ (కాడా) కమిషనర్‌గాను నియమించింది. ఈయన జేసీగా ఐదు నెలలు పనిచేశారు. సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారు.

కాకినాడ కార్పొరేషన్

కమిషనర్‌గా భావన



కార్పొరేషన్(కాకినాడ), జూలై 20: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా భావనను నియమిస్తూ ప్రభుత్వ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈమె 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. గతంలో విజయనగరం జిల్లా సబ్‌కలెక్టర్‌గాను, రాష్ట్ర వార్డు సచివాలయాల శాఖ అడిషనల్ డైరెక్టర్‌గానూ పనిచేశారు. తాజాగా ఆమెను కాకినాడ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీచేసింది.



జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ విప్పర్తి

ప్రజారోగ్యం, పారిశుధ్యం, రహదార్ల నిర్వహణపై

ప్రత్యేక దృష్టి సారించాలి

- నిధుల విడుదల కోసం పవన్ కల్యాణ్‌ను కోరదాం..
- సాదాసీదాగా జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం
- భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలపై చర్చ
- కోనసీమను ముంపు బారి నుంచి గట్టెక్కించాలి

7లో

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై20: గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న పదోన్నతులు ఎట్టకేలకు లభించాయి. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ కె.కన్నబాబు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రొసిడింగ్ నెం.1282228ను అనుసరించి పదోన్నతి పొందిన కార్యదర్శులను ఆయా జిల్లాలకు బదిలీ చేశారు. జోన్ 2లోని ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాలకు సంబంధించి గ్రేడ్3 కార్యదర్శులు 268 మంది, గ్రామ పంచాయతీల్లో పనిచేసే జూనియర్ అసిసెంట్లు 96 మంది, పంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ముగ్గురు, జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ కార్యాయాల్లో పనిచేసే జూనియర్ అసిసెంట్లు, టైపిస్టులు 32 మందికి గ్రేడ్2 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులిచ్చారు.

కాకినాడలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు దుర్మరణం.. మరో ఇద్దరి పరిస్థితి విషమం
- కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స.. మద్యం మత్తులో ఘోరం
- ద్విచక్ర వాహనదారుల్ని ఢీకొట్టి పల్టీలు కొట్టిన కొత్త కారు

7లో



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 20: జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కారానికి కృషిచేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం రెవెన్యూ అంశాలపై జిల్లా కలెక్టర్‌తోపాటు జేసీ రామ్‌సుందర్ రెడ్డి, పెద్దాపురం ఆర్డీవోలు.. అన్ని మండలాల తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించి ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో డంపింగ్‌యార్డ్, పరిశ్రమల స్థాపన, శ్మశాన వాటికలకు అవసరమైన భూసేకరణ పనులు చేపట్టాలన్నారు. మండల తహశీల్దార్ పరిధిలో మ్యూటేషన్ నిమిత్తం అందిన దరఖాస్తులను తప్పనిసరిగా గడువులోపు పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు ఇట్ల కిషోర్, సీతారామారావు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బాలసరస్వతి పాల్గొన్నారు.

ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని నాణ్యతతో సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో వివేకానంద సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార టాస్క్‌ఫోర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ అధ్యక్షుడిగా ఉండడం ఎంతో ఆనందం..

ఎంతో ఉత్కృష్టమైన సేవా కార్యక్రమాలు నిర్వహించే జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడిగా ఉండడం ఆనందాన్ని ఇస్తోందని కలెక్టర్ షాన్‌మోహన్ హర్షం వ్యక్తంచేశారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 96 సంవత్సరాలుగా విశిష్టమైన సేవాసంస్థగా రూపొంది విశేషమైన ఉన్నత సేవలను అందిస్తున్నందున అభినందించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వైడీ రామారావు, వైస్ చైర్మన్ సుగుణ, కోశాధికారి ప్రసాద్ బాబు, కార్యదర్శి శివకుమార్, ఓఎన్‌జీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'క్లీన్ కాకినాడ' లక్ష్యంగా స్వచ్ఛత వారోత్సవాలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై20: క్లీన్ కాకినాడ లక్ష్యంగా జిల్లాలో ప్రతి నెల చివరివారం స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలిసి స్వచ్ఛతా వారోత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో భక్తజనం

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.22.64 లక్షలు



ఆత్రేయపురం, జూలై 20: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల ఫలపుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుండి తరలి వచ్చిన భక్తులు చిరుజల్లులో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని స్వామివారిని గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. వివిధసేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.22.64లక్షలు లభించినట్టు ఉపకమీషనరు కిషోర్‌కుమార్ తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, జూలై 20: తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్లవిక్రయం ద్వారా 1,07,020 అన్నదాన విరాళాలు రూ. 27,886 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.3,440 తులాభారం రూ.150, లడ్డూ ప్రసాదం ద్వారా 10,800, వెరసి రూ. 1.49,296 ఆదాయం సమకూరినట్లు ఈవో వడ్డి శ్రీనివాస రావు తెలిపాయి.. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు దరఖాస్తులు చేసుకోండి

అమలాపురంటౌన్, జూలై 20: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్నివీర్ వాయు పథకంలో భాగమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా ఉపాధి అధికారి జి యి.వసంతలక్ష్మి తెలిపారు. ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు ఈనెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన అవివాహితులైన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులు. అభ్యర్థుల వయోపరిమితి 21 ఏళ్లలోపు ఉండాలి. 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్యలో జన్మించిన అభ్యర్థులు అర్హులు. గణితం, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్టులో 50 శాతం మార్కుల ఉత్తీర్ణతతో ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, డిప్లమో, తత్సమానమైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ మూడు విభాగాలుగా ఉంటుందని, ఆన్‌లైన్‌లో రాత పరీక్ష, ఫిజికల్, మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలతో పాటు అర్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.550 చెల్లించాల్సి ఉంటుంది.

పాదగయలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

పిఠాపురం, జూలై 20: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి సాంబశివరావునాయుడు సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను సతీసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు పలికారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతంపలికి శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

పంటకాల్వలోకి దూసుకెళ్లిన కాలేజీ బస్సు

● విద్యార్థులు సురక్షితం



ఉప్పలగుప్తం, జూలై 20: ఓడ లరేవు నుంచి కూనవరం విద్యార్థులతో వస్తున్న ఓ కళాశాల బస్సు శనివారం సాయంత్రం సరిపల్లి వద్ద పంటకాల్వలోకి బోల్తా కొట్టింది. ఓడలరేవు నుంచి సరిపల్లి మీదుగా కూనవరం వస్తున్న సమయంలో స్టీరింగ్ ఫెయిలవ్వడంతో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. స్వల్ప గాయాలతో విద్యార్థులు బయపడ్డారు.

రంపచోడవరం ఐటీడీఏ పీవోగా సింహాచలం



రంపచోడవరం, జూలై20 : రంపచోడవరం ఐటీడీఏ పీవోగా కట్టా సింహాచలంను నియమించారు. ఈయన ఏపీ సీఆర్‌డీఏలో పనిచేస్తున్నారు. బదిలీపై రంపచోడవరం ఐటీడీఏ పీవోగా వస్తున్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన సింహాచలం గతంలో రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ పీవోగా పని చేసిన సూరజ్‌గనోరియా గుంటూరు బదిలీ అయ్యారు.

గోదావరి పరవళ్లు



● 4.09లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
● చింతూరు వద్ద 35 అడుగుల శబరి నీటిమట్టం
● గ్రామాలను చుట్టుముట్టిన వరద
● కొట్టుకుపోయిన రహదారులు
● స్తంభించిన రాకపోకలు

ధవళేశ్వరం, జూలై 20: ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల ఉపనదులతో పాటు వాగులు, వంకలు ఉప్పొంగి గోదావరిలో కలుస్తుండడంతో సీజన్‌లో మొదటిసారిగా గోదావరి వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరుగుతోంది. దీంతో శనివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, విజ్జేశ్వరం ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను 1.5మీటర్లు, ర్యాలీ, మద్దూరు ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 2మీటర్ల మేర పైకి ఎత్తి 4,09,459 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 8.70అడుగులుగా నమోదైంది.. ఎగువన ఉపనది ఇంద్రావతి, దిగువున శబరి నుంచి వరదనీరు గోదావరికి చేరుతుండడంతో ధవళేశ్వరం వద్ద సోమవారం నాటికి వరద ప్రవాహం మరింత పెరిగి 9లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం శనివారం సాయంత్రానికి 35.20అడుగులకు చేరుకుంది. నీటిమట్టం మరింత పెరగవచ్చని అంచనా.

చింతూరులో అత్యధిక వర్షపాతం

చింతూరు, జూలై 20: చింతూరు డివిజన్ తడసి ముద్దైంది. ఎటుచూసినా వరద నీరే. శనివారం ఉదయానికి చింతూరులో 20.7 సెంటీ మీటర్లు, కూనవరం 6. 6, ఎటపాక 6.8, వరరామచంద్రపురం మండలంలో 8.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రానికి చింతూరువద్ద శబరి నీటిమట్టం 35 అడుగులకు చేరుకుంది. చింతూరు మండలంలోని సోకిలేరు, చంద్రవంక, చీకటివాగు, కుయుగూరు, అత్తాకోడళ్ళ వాగు, తడిక వాగులు వరరామచంద్రపురం మండలంలో అన్నవరం వాగు ఉధృతిగా ప్రవహిస్తున్నాయి. కూనవరం మండలంలో కోండ్రాజుపేట, టేకులబోరు గ్రామాల వద్ద రహదారులపై వరద నీరు చేరింది. ఎటపాక మండలం, తోటపల్లి, నెల్లిపాక, నందిగాం గ్రామాల వద్ద వాగులు గోదావరి ఎగపోటుతో నిండుగా ప్రహిస్తున్నాయి. కూనవరం మండల కేంద్రానికి చెందిన పలు కుటుంబాలు, వరరామచంద్రపురం మండలంలోని ఒడ్డుగూడెం, ఒడ్డుగూడెం కాలనీకి చెందిన పలు కుటుంబాలు వారి సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరరామచంద్రపురం మండలంలో ముంపు ప్రాంతాలకు చెందిన బాధితులకు రేషను సరఫరా చేశారు. ఇక వర్షం ధాటికి చింతూరు మీదుగా ఒడిస్సాకు వెళ్ళే 326 నెంబరు జాతీయ రహదారి కుయుగూరు వద్ద కొట్టుకపోయింది. అదే దశలో చింతూరు కుయుగూరుల నడుమ వాగు వంతెనతో పాటు చింతూరు వరరామచంద్రపురం చింతూరు మండలాల నడుమ పలు వాగుల వంతెనలపై కూడా వదర నీరు ప్రవహిస్తుండడంతో ఆ దిశగా రాకపోకలు పూర్తిగా నిలచిపోయాయి. వాగుల వెంబడి ఎటువంటి ప్రయాణాలను అధికారులు అనుమతించడంలేదు. ఆ మేరకు వాగుల వెంబడి సిబ్బందిని కాపలాగా ఉంచారు. వరరామచంద్రపురం మండలంలోని అన్నవరం వాగు చప్టా కొట్టుకపోవడంతో అధికార యంత్రాంగం మరమ్మత్తులు పనులు చేపట్టి రాకపోకలు పునరావృతమయ్యే దిశగా చర్యలు చేపట్టింది. ముంపు గ్రామాలలో 227 మంది గిర్భణి మహిళలు ఉన్నట్లు వైద్యశాఖ గుర్తించింది. ఆ మేరకు ఆయా ముంపును అనుసరించి గర్భిణి మహిళలను చింతూరు, కూనవరం ఆసుపత్రులకు నాటుపడవలు, ఆటోల ద్వారా తరలిస్తున్నారు. వారందరికి ఆసుపపత్రులలో భోజన వసతి సమకూర్చుతున్నారు. ఇప్పటి వరకు చింతూరు ఏరియా ఆసుపత్రికి సాయంత్రం ఏడు గంటల వరకు 36 మంది, కూనవరం ఆసుపత్రికి 15 మంది గర్భిణి మహిళలను తరలించినట్లు డిప్యూటి డీఎంహెచ్ఓ పుల్లయ్య తెలిపారు.రాజమంద్రి, పాడేరు ఘాట్లపై ప్రయాణం కేవలం ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు మాత్రమే నని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాలు జారి చేశారు. వర్ష ధాటికి కొండ చెరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ఈ మేరకు కలెక్టర్ నిర్ణయం తీసుకోవడం జరిగింది.



చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ నీట మునిగిన ప్రధాన రహదారి

సీలేరుకు జలకళ

మోతుగూడెం, జూలై 20: సీలేరు నది పరివాహక ప్రాంతంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జలాశయాల్లోకి నీరు చేసి జలకళతో కళకళలాడుతున్నాయి. ఎగువున ఉన్న కొండ ప్రాంతాల నుంచి వర్షపునీరు జలాశయాల్లోకి ఉరకలేస్తూ వచ్చి చేరుతుండటంతో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. సీలేరు కాంప్లెక్సులోని జల విద్యుత్ కేంద్రాలకు నీటి సమస్య తప్పిందని జెన్‌కో అధికార్లు భావిస్తున్నారు. సీలేరు నది పరివాహక ప్రాంతంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీలేరు కాంప్లెక్సు ప్రధానమైన జలాశయం అయిన బలిమెల జోలాపుట్‌లో 6.1649 టీఎంసీలు నీటినిల్వలు వచ్చి చేరాయని, అలాగే డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో 3టీఎంసీల వరకు నీటి నిల్వలు వచ్చి చేరాయని జెన్‌కో అధికార్లు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జోలాపుట్‌కు 4728 క్యూసెక్కులు, బలిమెలకు 31459 క్యూసెక్కులు, గుంటవాడకు 3480 క్యూసెక్కులు, డొంకరాయికి 3591 క్యూసెక్కులు, ఫోర్‌బైకు 2853క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతున్నాయి. డొంకరాయి ఏపీపీ డ్యాం కూడా వరదనీరు ఉధృతంగా వచ్చి చేరుతుంది. శనివారం ఏపీపీ డ్యాంకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరడంతో ఇక్కడ నీటి మట్టం పూర్తిస్థాయికి చేరింది. ఏపీపీ డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 940అడుగులు కాగా శనివారం ఉదయానికి అది పూర్తిస్థాయికి చేరుకోవడంతో జెన్‌కో అధికార్లు అప్రమత్తమై రెండు గేట్లు ఎత్తి 10000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



నీట మునిగిన గండిపోశమ్మ ఆలయం

గండిపోశమ్మ ఆలయాన్ని ముంచిన వరద

● ముంపు గ్రామమైన తాళ్ళూరులో చిక్కిన 22 కుటుంబాలు

దేవీపట్నం, జూలై20: గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలో గోదావరి వరద పెరుగుతూ వచ్చింది. శనివారం నాటికి గండిపోశమ్మ అమ్మవారి ఆలయాన్ని గోపురం వరకు తాకింది. అదేవిధంగా మండలంలోని ఫజుల్లాబాద్, సీతపల్లి తదితర వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. ముంపు గ్రామం తాళ్ళూరులోనే 22 కుటుంబాలు ఉండిపోవడంతో వారంతా వరదధాటికి కొండపైకి వెళ్లి తలదాచుకుంటున్నారు. అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవలసి ఉంది. వరద ఉధృతికి ఎక్కడికక్కడ ప్రజలను అధికారులు, పోలీసులు అప్రమత్తం చేస్తూ గోదావరి, వాగుల వద్దకు వెళ్లనీయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కోనసీమను ముంపు నుంచి.. గట్టెక్కించాలి



జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, ఆనందరావు, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

● భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలపై చర్చ
● గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి
● నిధుల విడుదల కోసం పవన్ కల్యాణ్‌ను కోరదాం
● సాదాసీదాగా జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడసిటీ, జూలై 20: గత కొన్ని రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలవల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని ఆవాసాల్లో ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుధ్య చర్యలను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం కాకినాడ జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగాయి. ఇందులోభాగంగా ఆర్థిక-ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యం, అభివృద్ధి పనులు తదితర అంశాలపై 1,2,4,7 స్థాయీ సంఘాల సమావేశాలు జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగాయి. వ్యవసాయం అంశంపై 3వ స్థాయీ సంఘ సమావేశం వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు, సాంఘిక సంక్షేమం అంశంపై 6వ స్థాయీ సంఘ సమావేశం వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, స్త్రీ శిశు సంక్షేమం అంశంపై 5వ స్థాయి సంఘ సమావేశం జడ్పీటీసీ రొంగల పద్మావతి అధ్యక్షతన జరిగాయి. సమావేశాలలో జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజారోగ్యం, పారిశుధ్యం, ముంపు నివారణ, రహదార్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులను కోరారు. తాగునీటి వనరుల క్లీనింగ్, క్లోరినేషన్, నీటి నమూనాల టెస్టింగ్, పైపులైన్లలోకి డ్రైనేజీ కలుషిత నీరు కలువకుండా నివారణ పనులను అన్ని ఆవాసాల్లో చేపట్టాలని పలువురు జడ్పీటీసీ సభ్యులు అధికారులను కోరారు. ఇటీవల బెండపూడి, యు కొత్తపల్లి, ఏవీనగరం గ్రామాల్లో డయేరియా ప్రబలిన నేపథ్యంలో మరింత అప్రమత్తత అవసరమని సూచించారు.

వరద, ముంపు సమస్యలపై ఎమ్మెల్యేల గళం..

గోదావరి వరద వల్ల పంట భూములు ముంపునకు గురికాకుండా నివారించేందుకు కాలువలు, డ్రెయిన్లలో గుర్రపు డెక్క తొలగింపును వెంటనే చేపట్టాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అన్ని కనీస సదుపాయాలు అందేలా చూడాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ కోరారు. భారీ వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో కోనసీమలో వరద, ముంపు సమస్యలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రస్తావించారు. రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపు జాప్యం జరుగుతోందని, చెల్లింపులు వేగవంతం చేసి రైతులు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని 3వ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు కోరారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలో అసంపూర్తిగా మిగిలిపోయిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను పూర్తిచేసి వినియో గంలోకి తేవాలని 5వ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు కోరారు. నిధుల కొరత వల్ల ఆర్థిక, ప్రణాళిక, పనులు ముందుకు సాగడం లేదని, చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు కూడా జరగలేదని 6వ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

20 నెలలుగా జడ్పీటీసీలకు గౌరవ వేతనాల చెల్లింపులు లేవు..

గడచిన 20 నెలలుగా జడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం చెల్లింపులు కూడా జరగలేదని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఛైర్మన్ దృష్టికి తెచ్చారు. జడ్పీకి రావలసిన గ్రాంట్‌ల సత్వర విడుదల కోసం ప్రభుత్వాన్ని కోరి, నిధులు రాగానే అన్ని చెల్లింపులు చేస్తామని ఛైర్మన్ వేణుగోపాలరావు తెలిపారు. జిల్లా నుంచే శాసనసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించినందున ఈ నిధుల విడుదల కోసం జడ్పీ ద్వారా కోరదామని వైస్‌ఛైర్మన్‌లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత తెలిపారు. సమావేశాల్లో వివిధ ప్రజా ప్రాధాన్యతాంశాలపై సమగ్రమైన చర్చ జరగడం పట్ల జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రామగోపాల్, ఉమ్మడి జిల్లా జడ్పీటీసీలు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పాడేరు జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 : దేశానికి అన్నం పెడుతున్న రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి అశోక్ ఘోషాల్ కోరారు. రాజమహేంద్రవరం మావో భవన్‌లో శనివారం జరిగిన అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లా డారు. కేంద్ర ప్రభుత్వం 2024-25 మార్కెటింగ్ సీజన్‌లో వరికి కనీస మద్దతు ధరను కేవలం రూ.117లు మాత్రమే పెంచడం దుర్మార్గమని అన్నారు. ప్రధాని మోదీ సర్కార్ అనుసరిస్తున్న రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా మాట్లాడుతూ కేంద్రంలో మోదీ సర్కార్, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్లలో వ్యవసాయరంగానికి అధిక నిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల నుంచి కాపాడుకోవాలన్నారు. సభ అనంతరం మావో భవన్ నుంచి గోకవరం బస్టాండు వరకూ రైతు కూలీలు ప్రదర్శన చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.ప్రకాష్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, వి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి పిఠాపురం ముస్తాబు

● దత్తక్షేత్రం, సాయిబాబా ఆలయాల్లో ఏర్పాట్లు



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం

పిఠాపురం జూలై 20: దత్తాత్రేయుడు స్వయంభూ వెలసిన క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానమైన పిఠాపురం పట్టణం గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధమైంది. పట్టణంలోని దత్తక్షేత్రాలు, సాయిబాబా ఆలయాల్లో ఈ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయకమిటీలు, దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నాయి. దత్త క్షేత్రాల్లో వేడుకలకు ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాలు నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. ఇప్పటికే ఆయా ఆలయాల వసతిసముదాయాలు, ప్రవేటు వసతి గృహాలు, లాడ్జిలు మహారాష్ట్ర, కర్నాటక భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పట్టణంలోని బైపాస్‌రోడ్డులో గల గోపాల్‌బాబా ఆశ్రమం. అగ్రహారంలోని అనఘాదత్త క్షేత్రం, సినిమాసెంటర్ లోని షిర్డీ సాయినాథ్ మందిరంలో, మెయిన్‌రోడ్డులో గల సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు కార్యక్రమాలు జరగనున్నాయి. పట్టణ శివారులోని విశ్వవిజ్ఞానవిద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో గురుపౌర్ణమి సభ జరగనున్నది. పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేస్తారు. సాయిబాబా, దత్త ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

సౌదీ ఎడారిలో మరో తెలుగోడు

● రక్షించాలంటూ ఇసుకపూడివాసి వీడియో వైరల్
● స్పందించిన లోకేశ్.. రెండ్రోజుల్లో ఇంటికి చేరుస్తామని భరోసా



సౌదీ ఎడారిలో చిక్కుకున్న వీరేంద్రకుమార్

అంబాజీపేట, జూలై 20: ఉమ్మడి చిత్తూరు జిల్లా వాయ ల్పాడు మండలానికి చెందిన శివ ఏడాది దేశంలో చిక్కుకుని నరకయాతన అనుభవించి.. ఎట్టకేలకు మంత్రి లోకేశ్ చొరవతో తిరిగి స్వదేశానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరువక ముందే మరో తెలుగోడు సౌదీ ఎడాదిలో చిక్కుకుని అష్టకష్టాలు పడుతున్న వైనం వెలుగులోకి వచ్చింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి మెరకపేటకు చెందిన సరెళ్ల వీరేంద్రకుమార్ బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లి.. ఏజెంట్ మోసంతో అక్కడి ఎడారిలో చిక్కుకుని నరకయాతన పడుతున్నాడు. వీరేంద్ర వంటమనిషిగా పనిచేసేందుకు ఈ నెల 9న మధ్యవర్తులు, ఏజెంటు ద్వారా ఖత్తర్ దేశానికి వెళ్లాడు. 10న ఖత్తర్‌లో దిగిన అతడిని అక్కడి నుంచి సౌదీ అరేబియాకు పంపించారు. తీరా ఇంటిలో పనులు, వంట పనులు కాకుండా.. వీరేంద్రకుమార్‌ను ఎడారిలో ఒంటెల కాపరిగా నియమించారు. అక్కడ ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రతల కారణంగా వీరేంద్రకు రక్తపు వాంతులబారిన పడ్డాడు. ఆ ప్రాంతంలో తాగేందుకు నీరు, ఆహారం దొరక్క నరకయాతన పడుతున్నాడు. దీంతో అతడి ఆరోగ్యం క్షీణించింది. దీంతో నత దయనీయ స్థితిని వివరిస్తూ తల్లిదండ్రులు సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ, తమ్ముడు రవీంద్రకు వీరేంద్ర వాట్సాప్‌ద్వారా వీడియో సందేశం పంపించాడు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు విషయాన్ని స్థానిక సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్‌కు తెలిపారు. వారు ఈ నెల 19న అమరావతిలోని ఎన్ఆర్ టీఎస్ విభాగం (తెలుగు సొసైటీ) అధికారులకు వీరేంద్ర ఇబ్బందులను వివరిస్తూ ఫిర్యాదు చేశారు. అలాగే తల్లిదండ్రులు కుమారుడి వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఈ పోస్టుపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. రెండు రోజుల్లో స్వదేశానికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియా వేదికగా ఆయన హామీ ఇచ్చారు. కాగా, తమను ఇబ్బందులు లేకుండా చూసుకుంటానని ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన తమకుమారుడు ఇప్పుడు చావుబతుకుల్లో ఉన్నాడంటూ వీరేంద్ర తల్లిదండ్రులు సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ, తమ్ముడు రవీంద కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇల్లు కట్టి సెటిల్ అవుతానని, తమ్ముడ్ని ఉన్నత చదువులు చదివిస్తానని చెప్పాడంటూ కొడుకును తలచుకుని రోదిస్తున్నారు. వీరేంద్రకుమార్ కుటుంబ సభ్యులను నియోజకవర్గ టీడీపీ నాయకులు శనివారం పరామర్శించారు. వీరేంద్రను రెండు రోజుల్లో స్వదేశానికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ మాటిచ్చారని, అధైర్యపడొద్దని వారికి ధైర్యం చెప్పారు.

ముగ్గురు మిలీషియా సభ్యుల అరెస్టు



విలేకరు సమావేశంలో మాట్లాడుతున్న చింతూరు ఏఎస్పి రాహుల్ మీనా

చింతూరు, జూలై 20: మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు మిలీషియా సభ్యులను శనివారం అరెస్టు చేసినట్లు చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు. ఈ మేరకు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడిం చారు. ఏడుగురాళ్లపల్లి అటవీ ప్రాంతంలో మిలీషియా సభ్యులు సమావేశమైన సమాచారం అందుకున్న చింతూరు పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో మావోయిస్టు మిలీషియా సభ్యులుగా వ్యవహరిస్తున్న వంజం ఉంగయ్య, కుర్స రాజకుమార్, మడివి ఇరమయ్యలు పోలీసుల చేతికి చిక్కారన్నారు. వారిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి నుంచి ఒక ప్రెషర్‌బాంబ్, 3 గ్రెనేడ్లు, రెండు ఎలక్ట్రికల్ డిటోనేటర్సు, ఐరన్ ముక్కలు, ఎలక్ట్రికల్ వైర్, బ్యాటరీ, మావోయిస్టులకు చెందిన కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురు మిలీషియా సభ్యులు కూడా ఎటపాక మండలానికి చెందినవారేనన్నారు. వీరిలో ఉంగయ్యది విస్సాపురం పంచాయతీ సంగంపాడుకాగా, 2022లో శబరి ఏరియా కమిటీ కమాండర్ గీత ఇతడిని గ్రామ కమిటీ సభ్యుడిగా నియమించిందన్నారు. కుర్స రాజకుమార్ ది కూడా సంగంపాడు గ్రామమే కాగా, మావోయిస్టు పార్టీ ఇతడిని సంగంపాడు గ్రామ మిలీషియా కమాండర్‌గా నియమించారన్నారు. మడవి ఇరమయ్య చుక్కలపాడు గ్రామం కాగా, మిలీషియా సభ్యుడిగా, గ్రామకమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఈముగ్గురు. 2024లో మల్లంపేటలో పోలీసులను హతమార్చేందుకుగాను అంబుష్ వేయడం, ఏడుగురాళ్లపల్లిలో తునికాకు గోదామును తగులబెట్టడం, ఏడుగురాళ్ళపల్లి సంతలో మావోయిస్టు పార్టీ కరపత్రాలను వేయడం లాంటి నేరాలలో పాల్గొన్నారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

కళాశాల విద్యారంగ అభివృద్ధికి చర్యలు

● కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్

రాజమహేంద్రవరంఅర్బన్, జూలై 20 : రాష్ట్రంలో కళాశాల విద్యారంగ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని, ప్రధానంగా ఇంటిగ్రేటెడ్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై అటానమస్ కళాశాలలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అటానమస్ కళాశాలల ప్రధానాచార్యులు, ఇతర ముఖ్య సిబ్బందికి మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సభలో శనివారం ఆయన మాట్లాడారు. అటానమస్ కళాశాలలతోపాటు ఇతర డిగ్రీ కళాశాలలు అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ, కమిషనరేట్ అధికారులు కె.విజయబాబు, అనిల్‌కుమార్, ఆర్‌జేడీలు,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర పాల్గొన్నారు.

కాకినాడ

నేడు శాకంబరిగా బాలాత్రిపురసుందరి దర్శనం

పోర్టు సిటీ (కాకినాడ), జూలై 20: నగరంలోని సూర్యారావుపేటలో శ్రీబాలాత్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో దర్శనమిస్తారని ఆలయ ఈవో సీహెచ్.భాస్కరరెడ్డి తెలిపారు. మొత్తం 8 టన్నుల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో దేవాలయ ప్రాంగణాన్ని అలంకరిస్తామని వివరించారు. ఉదయం 6గంటల నుంచి దర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు.

పారిశుధ్యం, వైద్యంపై దృష్టి : ఎమ్మెల్యే సత్యప్రభ

శంఖవరం, జూలై 20: సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని పెట్టుకుని ప్రతి గ్రామంలో పారిశుధ్య వైద్యంపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ పర్వత రాజుబాబు అధ్యక్షతన జరిగిన మండల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీడీవో విజయ్‌కుమార్‌తో కలిసి సమీక్ష చేసి మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంగా పనిచేసి మండలాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దాలన్నారు. ఎటువంటి ఇబ్బందులున్నా తానూ అన్నివేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. నియోజక వర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పర్వత సురేష్, వెన్నా ఈశ్వరుడు, కిర్తి వెంకట సుభాష్, కర్రి శివ గణేష్, బద్దిరమణ, గాబు సుబ్రహ్మణ్యం, గొర్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే సత్యప్రభ


ఎస్పీకి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, జూన్ 20: కాకినాడ జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విక్రాంత్ పాటిల్‌ను శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కలిశారు. కాకినాడలోని ఎస్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎస్పీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని శాంతిభద్రతలకు, మహిళల రక్షణకు, ఆడపిల్లల భద్రత, యువత మత్తుపదార్థాలు జోలికి వెళ్లకుండా చర్యలు చేప ట్టాలని ఎస్పీని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన అనపర్తి ఎమ్మెల్యే



కలెక్టరేట్ (కాకినాడ), జూలై 20: అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెదపూడి మండలానికి సంబంధించి భారీ వర్షాలు, తుఫా నుల సమయంలో పంట పొలాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రని.. డ్రైనేజీలు, ఇరిగేషన్ కాలువల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

'యోగాతో సంపూర్ణ ఆరోగ్యం'

కాకినాడ సిటీ, జూలై 20: క్రీడలు, యోగాలో విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారికి సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్ అందించవచ్చని ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు, యోగా గురు చిట్టూరి చిట్టిబాబు పేర్కొన్నారు. జగన్నాథపురంలో రాక్ యోగా అకాడమీ వ్యవస్థాపకుడు, జాతీయ యోగాసన కోచ్ ధర్మాడి డీఎస్.ప్రసాద్ అధ్యక్షతన శనివారం ఉచిత క్రీడలు, యోగా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చిట్టిబాబు మాట్లాడుతూ 2036లో అహ్మదాబాద్‌లో నిర్వహించబోయే అంతర్జాతీయ ఒలింపిక్ పోటీల్లో యోగాకు స్థానం కల్పించడం సువర్ణావకాశమన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జా తీయ యోగా పోటీల్లో ప్రతిభ చాటిన యోగా క్రీడాకారులను శాలువాలతో సత్కరిం చారు. కిక్ బాక్సింగ్ ప్రో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పినపోతు శ్రీనివాస్, ఆయుష్ వెల్నెష్ కోచ్‌లు యేలూరి శివశంకర్, కొవ్వూరి శివప్రసాద్, కె.విజయ్‌కుమార్, విద్యార్థులు,తల్లిదండ్రులు ఉన్నారు.

'రైతులు మెళకువలు పాటించాలి'

సామర్లకోట, జూలై 20: రానున్న 2 రోజుల్లో అధిక వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున మండలంలో వరి నారుమడులు వేసిన రైతులు, నాట్లు దశ పూర్తయిన రైతులు మెళకువలు పాటించడం ద్వారా అధిక వర్షాల నుంచి నష్టాల నుంచి గట్టెక్కవచ్చని సామర్లకోట ఏవో ఐ.సత్య రైతులకు సూచించారు. శనివారం వేట్లపాలెం, వెంకటకృష్ణరాయపురం, సామర్లకోట అర్బన్ ప్రాంతాలకు చెంది నీట మునిగిన వరి పొలాలను ఆమె సిబ్బందితో కలిసి పరిశీలించారు. తాము ఊడ్చిన, వెదజల్లిన పొలాల నుంచి నీరు బయటకెళ్లే విధంగా కాలువలు శుభ్రపరుచుకోవాలని ఆమె తెలిపారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి'

జగ్గంపేట, జూలై 20: మండలంలో ప్రజా సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కాకినాడలో శనివారం జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశంలో జడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవిరఘురామ్ కోరారు. రైతాంగానికి ఉపయోగపడే తాళ్ళూరు లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతుల విషయంలో తగు చర్యలు తీసుకుని ఈ పంటకే నీరందించాలని కోరారు. జగ్గంపేటముంపుకు కారణం అవుతున్న వీరమ్మ చెరువు వాలు పూడికతీత పనులు చేపట్టి రిటైనింగ్ వాలు నిర్మాణం చేపట్టాలని జడ్పీటీసీ కోరారు.

ప్రజాభిప్రాయసేకరణ అడ్డగింత

రౌతులపూడి, జూలై 20: క్వారీ నిర్వాహకులు స్థానిక యువతకు అవకాశాలు కల్పించి మూలగపూడిలో ప్రజాభిప్రాయసేకరణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అరవింద క్రషర్ సమీపంలో సర్వేనెంబర్ 1పిలో మూలగపూడిలో 5.8 హెక్టార్లో మెటల్ మైనింగ్‌కు మెస్సర్స్ శ్రీను కన్‌స్ట్రక్షన్స్ దరఖాస్తు చేసుకుంది. లీజుపై జిల్లా రెవెన్యూ అధికారి కే.శ్రీమణి, పర్యావరణ ఇంజనీర్ సతీష్‌రెడ్డి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా సేకరణను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో 20ఏళ్లుగా క్వారీలు, క్రషర్లు నిర్వహిస్తున్నారు తప్ప స్థానికులకు ఉపాధి కల్పించలేదన్నారు. మైనింగ్ లీజు ప్రతినిధి మణికంఠ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణం క్వారీ నిర్వహించి గ్రామంలో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

సామర్లకోట, జూలై 20: సామర్లకోట వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆవరణలో గురుపౌర్ణమి పురష్కరించుకుని ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సుమిత్ జైన్, అమిత్‌జైన్ తెలిపారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి వైద్యులు పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అర్హత మేరకు గుర్తించిన వారికి కంటి శస్త్రచికిత్సలు, కళ్ళజోళ్ళు తామే ఉచితంగా అందజేస్తామని తెలిపారు. పరిసర ప్రాంతాలకు వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పిఠాపురం, జూలై 20: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం పిఠాపురం రథాలపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫంక్షన్‌హాలులో నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనరు కనకారావు తెలిపారు. సదరు కార్యక్రమానికి కలెక్టరు నగిలి షాన్‌మోహన్, జిల్లాస్థాయి దిగువ అధికారులు, డివిజన్, నియోజకవర్గ స్థాయి అధికారులందరూ హాజరవుతారని చెప్పారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలా ప్రజలు తమ సమస్యలు విన్నవించుకోవచ్చన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ వేదిక జరుగుతుందని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

29న మండల సర్వసభ్య సమావేశం

సర్పవరం జంక్షన్, జూలై 20: కాకినాడ రూరల్ మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 29న ఉదయం 10.30 గంటలకు ఇన్‌చార్జి ఎంపీపీ బిందిలి విరీష అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో రమేష్‌నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులంతా తమ శాఖలకు చెందిన పూర్తిసమాచారంతో హాజరుకావాలని కోరారు.

గురు పౌర్ణమికి ఆలయాల ముస్తాబు

ఏలేశ్వరం, జూలై 20: గురు పౌర్ణమి వేడుకలకు మండలంలోని సిరిపురం, యర్రవరం, పట్టణంలో ఏలేరు నదీతీరాన బాబా మెట్టమీద, మెక్కారావు కాలనీ, లింగవరం కాలనీలలో శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాలను కమిటీ సభ్యులు, పురోహితులు ముస్తాబు చేశారు. తెల్లవారు జాము నుంచి కాగడా హారతి, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ప్రత్యూషకు డాక్టరేట్

గండేపల్లి, జూలై 20: మండలంలోని మురారి గ్రామానికి చెందిన చంద్రాల ప్రత్యూషాచౌదరికి ప్రతిష్టాత్మకమైన గీతం యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని గీతం యూనివర్శిటీలో శనివారం సాయంత్రం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ సెర్మనీలో ఆమె డాక్టరేట్ అందుకున్నారు. విశాఖలోని గీతం వర్శిటీలో ఇంప్లిమెంటేషన్ అండ్ పెర్ఫార్మెన్స్ ఇవల్యూషన్ ఆఫ్ ఎఫిసెంట్ ఆర్కిటెక్చర్ ఫర్ ఒన్ డైమెన్షనల్ టూ డైమన్షనల్ ఫైనిట్ ఇంపల్స్ ఫిల్టర్స్ అనే అంశంపై ఆమె పీహెచ్‌డీ చేశారు. ప్రత్యూషకు పలువురు ప్రొఫెసర్లు, మురారి గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

డీఎల్ఎంటీలకు శిక్షణా తరగతుల ముగింపు

సామర్లకోట, జూలై 20: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు, పేదరికంలేని గ్రామాలగా రూపుదిద్దేందుకు శిక్షణ పొందిన డీఎల్ఎంటీలు కృషి చేయాలని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. సామర్లకోట ఈటీసీ ఆవరణలో 3 రోజుల పాటు 8 జిల్లాలకు చెందినవారికి నిర్వహించిన శిక్షణా తరగతులు ముగింపు సభ శనివారం వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణ పొందిన 72 మంది డీఎల్ఎంటీలకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు జీవీ.శ్రీదేవి. పీవీ శ్రీనివాసరావు, వి.ప్రసాద్ పాల్గొన్నారు.

వెంకటరమణకు నాయకుల పరామర్శ

తొండంగి, జూలై 20: మాతృవియోగంతో ఉన్న టీడీపీ జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోడ వెంకటరమణను శనివారం పలువురు నేతలు పరామర్శించారు. జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, టీడీపీ నేత లు రాంబాబు రాజు, కందా మురళి, పక్కుర్తి నూకరాజు, మల్లిపాము సత్యన్నారాయణ, వైసీపీ నేతలు కొయ్యా ము రళి, నాగం గంగబాబు, పేకేటి హరికృష్ణ, మడదా హేమంత్ పరామర్శించారు.

వీడని వర్షం..ముంపులో వరి పొలాలు

» ఆందోళనలో రైతులు » పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు


గొల్లప్రోలు మండలం లక్ష్మీపురంలో నీట మునిగిన వరి మడులు, జగ్గంపేటలో పంట పొలాలు

గొల్లప్రోలు రూరల్, జూలై 20: వర్షం వీడకపోవడంతో వరి పొలాలు ముంపులో చిక్కుకుంటున్నాయి. 3 రోజులుగా కురుస్తున్న వర్షాలతో గొల్లప్రోలు మండలంలోని గొల్లప్రోలు, మల్లవరం, లక్ష్మీపురం, సీతానగరం తదితర గ్రామాల్లో వెదజల్లు పద్ధతిలో వరిసాగు చేసిన పొలాలు, నారుమడుల్లోకి నీరు చేరింది. వర్షాలు ఇంకా తగ్గకపోవడంతో మొలక వచ్చి నారు దెబ్బతినే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు నిలిచిన పొలాలను మండల ఏవో సత్యనారాయణ పరిశీలించారు.

సామర్లకోట: గత 4రోజులుగా ఎడతెరిపి లేకుండా మండలంలో కురుస్తున్న వర్షాల కు పలు గ్రామాల్లో వరి పొలాలు నీటముంపు సమ స్యను ఎదుర్కొంటున్నాయి. దీంతో వెంకటకృష్ణరాయపురం, బోయినపూడి, మాధవపట్నానికి చెంది గయ్యాలదొడ్డి ప్రాంతానికి చెంది సుమారు 5వేల ఎకరాల వరి పొలాలు నీటముంపు బెడదను ఎదుర్కొంటున్నాయి. ఈ రాత్రికి వర్షాలు కొనసాగితే ఆదివారం ఉదయం నాటికి మొత్తం పొలాలు నీటమునిగే ప్రమాదం ఉందని రైతులు కలవరం చెందుతున్నారు. కాగా ఏలేరు కాలువ నుంచి సామర్లకోటకు చేరే నీటి ప్రవాహం శనివారం మధ్యాహ్నం నుంచి పెరుగుతుండడంతో సామర్లకోట మండలంలోని నవర, రావువారి చంద్రంపాలెం, పవర గ్రామాలలో వరి పొలాలు నీటముంపు సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జగ్గంపేట: భారీ వర్షాల కారణంగా మండలంలో నారుమళ్ళు పూర్తిగా నీట మునిగినట్టు రైతులు తెలుపుతున్నారు. జగ్గంపేట పట్టణ పరిసరాల్లో వెద జల్లే వరి వ్యవసాయసాగును చేపట్టారు. ఈ వర్షాల కారణంగా నీరుపూర్తిగా కిందకు దిగితేనే మొలకలు వస్తాయని లేకుంటే మొత్తం విత్తనాలు పోయినష్టం వాటిల్లుతుందని రైతులు తెలుపుతున్నారు. విద్యుత్ బోర్లు ఏలేరు నీరు అందుబాటులో ఉన్న చోట ఇప్పటికే ఉడుపులయ్యాయి. దీనికికారణంగా వర్షాలు అధికమవడంతో వారినాట్లు మునగడం జరిగింది.

గండేపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వరి పంటలు నీటమునిగాయి. మండలంలో గండేపల్లి, యల్లమిల్లి, మల్లేపల్లి, తాళ్ళూరు, మురారి పల్లంలో ఉన్న పొలాలన్నీ కూడా పూర్తిగా నీటమునిగాయి. నాట్లు వేసి వారం రోజులవుతుందని, వరిదుబ్బులు పూర్తిగా కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోటనందూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు 150 ఎకరాల్లో నారుమడులుకు నష్టం వాటిల్లినట్టు మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో నారుమడులను పరిశీలించారు. నారుమడి నష్టనివారణ చర్యల్లో భాగంగా జాగ్రత్తలను ఆయన రైతులకు వివరిం చారు. కోట నందూరు- తుని రహదారిపై అడ్డంగా ఉన్న చెట్లను కోటనందూరు పోలీస్‌లు తొలగించారు.

కిర్లంపూడి: మండలవ్యాప్తంగా శనివారం ఎడతెరిపిలేని వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. దీంతో రోడ్లపై నీరు పారింది. వేలంక నుంచి యర్రవరం రహదారి, రాజుపాలెం-రామవరం రహదారి, సింహాద్రిపురం రహదారి చిత్తడిగా మారింది.

సురక్షిత ప్రాంతానికి తరలింపు

తాళ్లరేవు, జూలై 20: పోలేకుర్రులో భారీవర్షాలకు మోకాలులోతు వర్షంనీటిలో నివాసం ఉంటున్న అందే నాగమణి కుటుంబాన్ని రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి శనివారం సురక్షిత ప్రాంతానికి తరలించారు. డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, వీఆర్వో శ్రీనివాసరావు బాధితులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. వారు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


కోటనందూరు: పొలాలు పరిశీలిస్తున్న అధికారులు

మహిళాభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు దోహదం


సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్

తాళ్లరేవు, జూలై 20: సమాజంలో స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తే మహిళాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని సెర్ప్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సత్యభామ అన్నారు. శనివారం జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ మేనేజ్డ్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా 3రోజుల రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సభ్యుల పరిజ్ఞానాన్ని మరింతగా బలోపేతం చేసి మండల మహిళా సమాఖ్యల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. మహిళా సమాఖ్యలు నిర్వహణ, ప్రాముఖ్యతలు, పూర్తిస్థాయి సౌకర్యాలపై మహిళా సమాఖ్య ఎపీఎమ్‌లు, అధ్యక్ష, కార్యదర్శులు, ఒబీలు, 16జిల్లాలకు చెందిన డీపీఎమ్‌లు, ఐబి, సీబీలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు టి.బాబూరావు, కె.మోహన్, గోదావరి సామఖ్య అధ్యక్షురాలు బొమ్మిడి వెంకటలక్ష్మి, కోశాధికారి కొల్లు నాగమణి, సంగాడి కామేశ్వరి, డొక్కాడి భవాని, గోదావరి సమాఖ్య మేనేజర్ కె.నరేష్, ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

'ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), జూలై20: వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. శనివారం ఆయన కొత్తపేట మార్కెట్, ఫౌండేషన్ హాస్పిటల్ రోడ్డు, ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షపునీరు నిల్వ లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలిచ్చారు. బొందగుంటలోని వెహికల్‌యార్డు ప్రాంతాన్ని సందర్శించారు. కమిషనర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్ తదితరులున్నారు.

'ఫ్లెక్సీలు తొలగించాలి'

ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డులో భాగంగా ఆదివారం సాయంత్రంలోగా పట్టణంలోని ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని కమిషనర్ జె.వెంకటరావు అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని హోర్డింగులు, ఫ్లెక్సీలు దశల వారీగా తొలగిస్తున్నామన్నారు. టూటౌన్ జంక్షన్ నుంచి జగన్నాధపురం బ్రిడ్జి వరకు, సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి జంక్షన్ వరకు, కోకిల సెంటర్ నుంచి 1టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఆదివారం తొలగించకపోతే సోమవారం నగరపాలక సంస్థ సిబ్బందితో తొలగించి సదరు ఖర్చు వసూలు చేస్తామన్నారు.

పేదలకు భోజన వసతి

కాకినాడ సిటీ, జూలై 20: డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని హరీష్ స్పోర్ట్స్ వద్ద పేదలకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై భోజనాలు స్వీకరించారు. సేవా సంఘం చైర్మన్ తలాటం హరీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి శనివారం కాకినాడ నగరవాసులకు మంచి భోజనం అందించేందుకు సేవా సంఘం సిద్ధంగా ఉందని హరీష్ తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి కోటయ్య స్వీట్స్ అధినేత చిట్టి పెద్ద రామకుమార్, కర్నూలుకు చెందిన కొణిదెల గాయత్రి, పినిశెట్టి సురేష్, పట్టాభిరామయ్య సహకారం అందించారు. కార్యక్రమంలో కస్తూరి పట్టాభిరామయ్య, చార్లీ, తాతీయులు, పిడకా శేషు, శ్రీను, మణికంఠ, కృష్ణవేణి, అనసూయ, రాజకుమారి తదితరులున్నారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీలో చోరీ

శంఖవరం, జూలై 20: కొంతంగి శివార్లలో ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీలో శనివారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. యజమాని కుక్కా కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం- శనివారం ఉదయం ఫ్యాకరీ దగ్గరకు వచ్చేసరికి తాళాలు బద్దలుకొటినట్లు గుర్తించామని, జీడిపప్పు మూటలు కనపడటంలేదని గుర్తుతెలియని వాహనంతో తరలించిన ఆనవాళ్ళను గుర్తించినట్టు తెలిపారు. చోరీకి గురైన సరుకు సుమారు రూ.7లక్షలు ఉంటుందని అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తును ప్రారంభించారు.

అభివృద్ధికి ప్రతీఒక్కరూ సహకరించాలి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ


కరప:సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కరప, జూలై 20: రాజకీయాలకతీతంగా మండల అభివృద్ధికి ప్రతీఒక్కరూ సహకరించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఆ తరువాత అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు సమిష్టిగా ప్రజాసంక్షేమానికి కట్టుబడి పనిచేయాలని హితవు పలికారు. మండలంలో ఆయా శాఖల ద్వారా జరిగిన ప్రగతిని అధికారులు సభకు వివరించి సభ్యుల సందేహాలు, సమస్యలను నివృత్తిచేశారు. ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా విచ్చేసిన నానాజీని ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పరిచయం చేసుకుని దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. జడ్పీటీసీ సుబ్బారావు, వైస్ఎంపీపీ బొమ్మిడి వీరరాఘవులు, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఏడీఏ కె.బాబూరావు, మండల వైద్యాధికారి రమావత్ శ్రీనివాసనాయక్ ఉన్నారు.

అలాగే కరప చిరంజీవి కల్యాణమండపంలో శనివారం ఉదయం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పలువురు విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేసి బాగా చదువుకోవాలని ఆశీర్వదించారు. ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, టీడీపీ కాకినాడరూరల్ కో కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబి, జనసేన, టీడీపీ మండల అధ్యక్షులు బండారు మురళి, దేవు వెంకన్న, బొగిరెడ్డి కొండబాబు, గంగాధర్, యాళ్ల పండు, గరగ పకీర్రావు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సర్పవరం జంక్షన్: రమణయ్యపేట మండల పరిషత్తు కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో 77 ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతున్న 8,372 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలతో కూడిన విద్యా కిట్లు పంపిణీ చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ వాటిని అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నానాజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బిందిలి విరీష, ఎంపీడీవో రమేష్‌నాయుడు, తదితరులున్నారు.


టిడ్కో లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దాపురం, జూలై 20: టిడ్కో లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం శివారు వాలుతిమ్మాపురం రహదారిలో నిర్మించిన టిడ్కో గృహసముదాయముల వద్ద లబ్ధిదారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు)తో పాల్గొని మాట్లాడారు. బ్యాంకు రుణాలు చెల్లించలేక నానాఅవస్థలు పడుతున్నామని రాజప్ప దృష్టికి లబ్ధిదారులు తీసుకువచ్చారు. ఈ విషయంపై ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గృహసముదాయాల వద్ద ఇబ్బందులను లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత తొందర్లో మిగిలిన లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించడం జరుగుతుందన్నారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను వైసీపీ నేతలు కబ్జా చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. సహజవనరులైన మట్టి, ఇసుకను అమ్ముకుని భారీగా డబ్బులు పోగుసుకున్నారన్నారు. వైసీపీ నేతలు కబ్జాచేసిన ప్రైవేటు స్థలాల యజమానులు ముందుకొస్తే ప్రభుత్వం వారికి అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు, పొలమరశెట్టి సత్తిబాబు, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి ఉన్నారు.

తిండిలేక రంగస్థల నటీమణి భిక్షాటన


భిక్షాటన చేస్తున్న సుబ్బలక్ష్మి

పోర్టు సిటీ (కాకినాడ), జూలై 20: ఒకప్పటి రంగస్థల నటీమణి మురమళ్ల సుబ్బలక్ష్మి తినడానికి తిండిలేక భిక్షాటన చేస్తూ కాలం వెలిబుచ్చుతోంది. అనేక సాంఘిక నాటకాల్లో, పరిషత్ నాటకాల్లో నటించి సుబ్బలక్ష్మి మెప్పించింది. రంగస్థల నటుడు, దర్శకుడు పం తం సత్యనాధన్ బృందంలో ఆమె పనిచేయడం జరిగింది. అయిన వాళ్లు దూరం కావడం, కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె మతి స్థిమితం కోల్పోయింది. తినడానికి తిండిలేక ఊరూరా తిరుగుతూ దేవాలయాల ముంగిట భిక్షాటన చేస్తోంది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్, మాజీ ఎమ్మెల్యే వర్మ దృష్టికి తీసుకెళ్లి ఆమెకు ఫించన్ ఇప్పించాల్సిందిగా కోరనున్నట్టు రంగస్థల నటుడు బి.వెంకటేష్‌నాయుడు తెలిపారు.

బండి ఎక్కించుకుని కర్రతో దాడి

పిఠాపురం, జూలై 20: ఆటో కోసం నిలుచున్న వ్యక్తిని మోటార్‌సైకిల్ ఎక్కించుకుని తీసుకువెళ్లి కర్రతో దాడి చేసి రూ.10వేలు దోపిడి చేసిన సంఘటన పిఠాపురం శివారులో శనివారం సాయంత్రం జరిగింది. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకి చెందిన పెండ్యాల రామకృష్ణ శనివారం సాయంత్రం పిఠాపురంలో న్యాయవాదిని కలిసేందుకు వచ్చాడు. పని పూర్తి చేసుకుని ఇంటికెళ్లేందుకు ఆటో కోసం ఉప్పాడ బస్టాండు సెంటర్‌లో నిలుచున్నాడు. ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వచ్చి మీది మల్లాం కదా అని ప్రశ్నించాడు. కాదు చేబ్రోలు అని చెప్పడంతో వెళ్లిపోయాడు. కొంత సమయం తర్వాత మళ్లీ వచ్చి అక్కడే రామకృష్ణ నిలుచోవడం చూసి నేను చేబ్రోలు వెళ్తున్నాను రమ్మని చెప్పడంతో అతడి మోటార్‌సైకిల్ ఎక్కాడు. మధ్యలో సదరు వ్యక్తి గ్లాసులు, వాటర్ ప్యాకెట్‌లు కొన్నాడు. పిఠాపురం నుంచి బైపాస్ వైజంక్షన్ దాటగానే ఉన్న పుంతరోడ్డులో మోటార్‌సైకిల్‌ను మళ్లించాడు. అక్కడ మద్యం సీసా తీసి మందు తాగమని అడగగా రామకృష్ణ తనకు అలవాటు లేదని చెప్పాడు. డబ్బులు ఇమ్మని అడగగా లేవని చెప్పడంతో కర్ర తీసుకుని దాడి చేశారు. అతడికి బుర్రపై, శరీరంపై ఇతర చోట్ల గాయాలయ్యాయి. రామకృష్ణ వద్ద ఉన్న రూ.10వేలు లాక్కొని సదరు వ్యక్తి పరారయ్యాడు. రామకృష్ణకు పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేశారు.

ఎన్‌సీఎస్టీ సభ్యుడికి వినతి

జేఎన్టీయూకే, జూలై 20: కాకినాడ జేఎన్టీయూకే గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బీఆర్ దొరస్వామినాయక్ తనకు ప్రొఫెసర్‌హోదా నిరాకరించడంపై నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎన్‌సీఎస్టీ)సభ్యుడు ఝూటోతు హుస్సేన్‌ని విశాఖపట్నంలో కలిసి శనివారం వినతి అందజేశారు. ఆయన స్పందిస్తూ దొరస్వామినాయక్ ప్రొఫెసర్ హోదా పట్ల తగిన చర్యలకు సిఫార్సుచేశారు. గతంలో దొరస్వామినాయక్ తనకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ అధ్యాపక సంఘం ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేయడం జరిగింది.

మంత్రి లోకేశ్‌ని కలిసిన శ్రీనివాస బాబా

సర్పవరం జంక్షన్, జూలై 20: తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా శనివారం ఉండవిల్లిలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. త్వరలో జరిగే నామినేటెడ్ పోస్టుల భర్తీలో సముచిత స్థానం, పదవి ఇచ్చేందుకు కృషి చేస్తానని నారా లోకేశ్ హామీ ఇచ్చినట్టు శ్రీనివాస బాబా తెలిపారు.

కలుషిత జలాల సరఫరా


వన్నెపూడిలో వచ్చిన కలుషిత జలాలు

గొల్లప్రోలు రూరల్, జూలై 20: గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో కుళాయిల ద్వారా కలుషిత జలాలు సరఫరా అయ్యాయి. గ్రామంలోని ఈబీసీ కాలనీతో పాటు అన్ని ప్రాంతాల్లో కుళాయిల నుంచి వచ్చే నీటిని పట్టుకోవాలని భావించిన ప్రజలకు షాక్ కలిగింది. నీరు బురద రంగులో, వాసన వస్తోంది. గ్రామానికి మల్లవరంలోని సమగ్ర రక్షిత మంచినీటి ప థకం నుంచి పైపులైన్లు ద్వారా మంచినీరు సరఫరా అవుతుంది. తరచూ తాగునీరు ఇదేవిధంగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. నీరు వాసన కూడా వస్తోందని, దీనిని తాగేందుకు, వాడుక నీరుగా వినియోగించుకునేందుకు భయపడాల్సి వస్తున్నదని, ఈ నీరు తాగితే వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తాగు నీరు పరిశుభ్రంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పూడిక తొలగింపుపై నిర్లక్ష్యం!


పిఠాపురం మున్సిపల్ కల్యాణ మండపం వద్ద డ్రెయిన్లల్లో తీసిన పూడికను తొలగించకుండా వదిలివేసిన దృశ్యం

పిఠాపురం, జూలై 20: డ్రెయిన్లల్లో పూడిక తొలగింపుపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతున్నది. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న డ్రెయిన్లల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించేందుకు పురపాలకసంఘం ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అన్నక్యాంటీన్, మున్సిపల్ కల్యాణమండపం తదితర ప్రాంతాల్లో 6రోజుల క్రితం డ్రెయిన్లల్లో పూడికను తొలగించారు. కానీ సిల్టును అక్కడి నుంచి తరలించకుండా వదిలివేశారు. 3రోజులుగా కురుస్తున్న వర్షాలకు సిల్టు మళ్లీ డ్రెయిన్లలోకి చేరుతోంది. డ్రెయిన్లల్లో తీసిన సిల్టు, పూడికను అదే రోజు అక్కడ నుంచి తొలగించేలా చర్యలుతీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట, జూలై 20: కిర్లంపూడి మండలం గోనేడ గ్రామంలో ఎప్రామ్ ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాదారపు వీరబాబు, ఉలిసి ఐ రాజు, మారిశె రామకృష్ణ, గోకేడ ప్రసాద్, కాయల మణికంఠ, సత్యంశెట్టి గణేష్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తునిరూరల్, జూలై 20: విశాఖపట్నానికి చెందిన కిమ్స్ హాస్పటల్ తుని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కిమ్స్ వైద్యనిపుణులు వైద్యసేవలు అందించగా రెవెన్యూ కార్యాలయ సిబ్బంది,సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక

పెద్దాపురం, జూలై 20: తెలంగాణలో జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జూనియర్ ఇండియా ప్రోబుల్స్ కబడ్డీ పోటీలకు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ మూడో సంవత్సరం చదువుతున్న మనోహర్ ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థిని చైర్మన్, కళాశాల ఈవో జెన్నిబాబు, ప్రిన్సిపాల్ సర్వారామేశ్వరుడు, పెదకాపు, పీడీ స్వామి అభినందించారు.

పలువురికి జనసేన నేతల సాయం

శంఖవరం, జూలై 20: నెల్లిపూడిలో వర్షాలకు ఇల్లుకూలిపోయిన కూలిపోయిన మేక పాండవుల కుటుంబానికి జనసేన మండల ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి సహాయాన్ని అందించారు. శనివారం కార్యకర్తలతో కలిసి బియ్యం మూట, కొంత ఆర్థికసాయం అందించారు. గతకొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడతూ ఇంటివద్దనే ఉంటున్న కోటిపల్లి పెదగురయ్య కుటుంబానికి బియ్యం, ఆర్థిసాయం అందించారు. కార్యక్రమంలో శీకోలు రాజు, జాన్, పి.నాగు, తలపంటి సత్యనారాయణ, తలపంటి వీరబాబు, పిర్ల మురళీ పాల్గొన్నారు.

జన సైనికుడికి బీమా అందజేత

తాళ్లరేవు, జూలై 20: జార్జీపేట గ్రామానికి చెందిన జనసైనికుడు పిల్లి సాయివెంకట నాగబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతడికి జనసేన క్రియాశీలక సభ్యత్వం ఉండడంతో రూ.30వేలు బీమా చెక్కును శనివారం జనసైనికులు అందజేశారు. జనసైనికులు ముత్యాల జయలక్ష్మి, అత్తిలి బాబూరావు, సూరంపూడి కుమార్ పాల్గొన్నారు.

డ్రైన్‌లో పూడికతీత

తాళ్లరేవు, జూలై 20: కోరంగి పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెం అతిసరమైదారంలో మురుగునీరు దిగువగా లేకపోవడంతో సర్పంచ్ పెయ్యల మంగేష్ ఆధ్వర్యంలో సెక్రటరీ రామరాజు డ్రైనేజీలను ఎక్స్‌వేటర్‌తో శనివారం పూడికతీత తీయించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దత్తత్రేయ వర్మ, పెయ్యల శ్రీనివాస్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

గండేపల్లి, జూలై 20: తాళ్ళూరు కు చెందిన మగ్గం ఏసు ప్రమాదవశాత్తు గుర్రె కాలు మొత్తం తొలగించడంతో ఆర్థిక పరిస్థితిమయ్యాయి. ఫ్రెండ్స్ ఛారిటీ సభ్యులు ఆ కుటుంబానికి నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు.